క్లుప్తంగా

ఐక్య పోరాటాలతోనే కార్మిక రాజ్య స్థాపన



కేకే భవన్‌లో కార్మిక జెండాను ఆవిష్కరిస్తున్న ఎంఏ గఫూర్

కర్నూలు(సెంట్రల్): ఐక్య పోరాటాల ద్వారానే కార్మిక రాజ్య స్థాపన సాధ్యమవుతుందని, అదే సీఐటీయూ ప్రధాన లక్ష్యమని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్ అన్నారు. గురువారం సీఐటీయూ 54వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. కార్మిక కర్షక భవన్‌లో ఎంఏ గఫూర్, సుర్జీత్ భవన్‌లో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు, సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ జెండాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గఫూర్ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తుండడంతో కార్మికులు ఉద్యోగులు కోల్పోవాల్సి వస్తోందన్నారు. పోరాటాల ద్వారా సాధించుకున్న లేబర్ చట్టాల స్థానంలో లేబర్ కోడ్‌లను తెచ్చి కార్మిక లోకాన్ని తీవ్ర సంకట పరిస్థితుల్లోకి నెట్టేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

స్కూల్ ఆయాలకు పెండింగ్ జీతాలు చెల్లించాలి



ఏడీ శ్యామూల్ పాల్‌కి వినతి పత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కర్నూలు సిటీ: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఆయాలకు పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని కోరుతూ ఏఐటీయూసీ నాయకులు గురువారం డీఈఓ ఆఫీస్ ఏడీ శ్యామూల్ పాల్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మునెప్ప మాట్లాడుతూ సర్కార్ బడుల్లో పని చేస్తున్న ఆయాలకు నాలుగు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో వారి కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయన్నారు. విద్యాశాఖ అధికారులు స్పందించి పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలోని దాదాపు అన్ని జిల్లాల్లోని ఆయాలకు జీతాలు చెల్లించారని, కర్నూలు జిల్లాలోని ఆయాలకు వేతనాలు చెల్లించకపోవడం బాధాకరమన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో ఏఐటీయూసీ నగర డిప్యూటీ కార్యదర్శి టి.రామాంజనేయులు తదితరులు ఉన్నారు.

పట్టుదలతో లక్ష్యాన్ని చేరుకోవాలి



విద్యార్థులను సన్మానిస్తున్న రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య

కర్నూలు సిటీ: విద్యార్థులు పట్టుదలతో లక్ష్యాన్ని చేరుకోవాలని రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య అన్నారు. గురువారం శ్రీ ఈశ్వరాస్ ట్యుటోరియల్స్‌లో ఏపీఆర్‌జేసీ, పాలిటెక్నిక్ పోటీ పరీక్షలకు శిక్షణ పొంది, ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ఆయనతో పాటు టీజీవీ కళా క్షేత్రం అధ్యక్షులు పత్తిఓబులయ్య, రవీంద్ర విద్యా సంస్థల డీన్ మమతామోహన్, వైస్ చైర్మెన్ జి.వంశీధర్‌లు ముఖ్య అతిథులుగా హాజరై, ర్యాంకులు సాధించిన విద్యార్థులు కె.నిఖిల్, కె.జాకీర్, కె.జయశ్రీ, వై.లిఖిత కృష్ణను సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు పోటీ పరీక్షలకు సన్నద్ధం అయ్యే ముందు ప్రణాళికను తయారు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో శ్రీఈశ్వరాస్ ట్యుటోరియల్స్ గౌరవ సలహాదారులు డి.ఈశ్వరయ్య, అధ్యాపకులు నునీతరోజ్, సుందరయ్య స్ఫూర్తి కేంద్ర కన్వీనర్ జే.ఎస్ శేషయ్య, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

నారాయణ విద్యాసంస్థలను సీజ్ చేయాలి

కర్నూలు (సిటీ): ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా అడ్మిషన్లు చేపట్టిన నారాయణ విద్యా సంస్థలను సీజ్ చేయాలని ఏఐఎస్‌ఏ, పీడీఎస్‌యూ, ఏఐఎస్‌ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని గాయత్రి ఎస్టేట్‌లోని నారాయణ స్కూల్‌లో ఆయా సంఘాల నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ ప్రభుత్వ గుర్తింపు లేకుండా బిల్డింగ్ నిర్మాణం పూర్తి కాకుండానే ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే అక్రమంగా అడ్మిషన్లు చేస్తున్నారన్నారు. టెక్నో, ఈ-టెక్నో, ఒలంపియాడ్, సీఓ కోర్సుల పేరుతో అడ్డగోలుగా ఫీజుల పేరుతో దోచేస్తున్నారన్నారు. ఈ విషయం తెలిసిన జిల్లా విద్యాశాఖ అధికారులు సైతం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. ధర్నాలో ఏఐఎస్‌ఏ రాష్ట్ర కార్యదర్శి ఎ.నాగరాజు, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న, పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షులు రమణ, ఏఐఎస్‌ఎఫ్ నగర కోశాధికారి అశోక్, పీడీఎస్‌యూ నాయకులు దామోదర్, నవనీత్, వర్ధన్, ఏఐఎస్‌ఏ నగర కార్యదర్శి నాని పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపులో పొరపాట్లకు తావివ్వొద్దు

- కర్నూలు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ



ఓట్ల లెక్కింపు సన్నద్ధ సమావేశంలో మాట్లాడుతున్న కర్నూలు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): వచ్చే నెల 4వ తేదీన చేపట్టే ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దని కర్నూలు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ సూచించారు. కౌంటింగ్ సిబ్బంది తప్పని సరిగా కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటించాలన్నారు. గురువారం స్థానిక నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్‌లో కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి కౌంటింగ్ హాలులో విధులు నిర్వర్తించే సిబ్బందితో సన్నద్ధ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమ యూనివర్సిటీలోని లైఫ్ సైన్సెస్ బ్లాక్ సమీపంలోని మూడవ అంతస్తులో ఏర్పాటు చేసిన కౌంటింగ్ హాల్‌లో కర్నూలు అసెంబ్లీ సెగ్మెంట్, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు వేర్వేరుగా కేటాయించిన గదులలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ సాగుతుందన్నారు. కౌంటింగ్ హాలులో విధుల్లో పాల్గొంటున్న సిబ్బంది కౌంటింగ్ రోజు ఉదయాన్నే కలెక్టరేట్‌కు చేరుకుంటూ కౌంటింగ్ కేంద్రానికి బస్సుల్లో తరలించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. కౌంటింగ్ కేంద్రంలోకి వెళ్లే సమయంలో కౌంటింగ్ ప్రక్రియ నిమిత్తం రిటర్నింగ్ అధికారి జారీ చేసిన గుర్తింపు కార్డు ప్రతి ఒక్కరి దగ్గర ఉంచుకోవాలన్నారు. పార్కింగ్ వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మొబైల్ డిపాజిట్ కేంద్రంలో సెల్‌ఫోన్‌లను, ఇతర ఎలక్ట్రానిక్స్ పరికరాలను అక్కడే జమ చేయాలన్నారు. అప్రమత్తతతో రౌండ్ల వారీగా ఓట్ల లెక్కింపు గణాంకాలను అందజేయాలన్నారు. నిబంధనలు అతిక్రమించే వారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మోహన్ కుమార్, మెప్మా పీడీ నాగ శివలీల పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులు ఆరోగ్యానికి హానికరం



విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టినరసమ్మ

కర్నూలు(హాస్పిటల్): పొగాకు ఉత్పత్తులు వాడటం ఆరోగ్యానికి హానికరమని కర్నూలు మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టినరసమ్మ అన్నారు. ప్రపంచ పొగాకు దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కర్నూలు మెడికల్ కాలేజి కమ్యూనిటీ మెడిసిన్ డిపార్ట్‌మెంట్, ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కమ్యూనిటీ మెడిసిన్‌లో పోస్టింగ్‌లో ఉన్న ఇంటర్నీస్ విద్యార్థులు కాలేజి గేట్ వద్ద వినూత్నంగా డమ్మి సిగరెట్టు తయారు చేసి పొగాకు ఉత్పత్తుల వల్ల కలిగే నష్టాలను నినాదాలు చేసి వాటిని కాల్చి వేశారు. అనంతరం ఫ్లాష్‌మాబ్, ఇంటర్నీస్ విద్యార్థులచే ప్రపంచ ఆరోగ్య సంస్థ-2024 సంవత్సరానికి గాను ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం ఉద్దేశ్యమైన 'పిల్లలను పొగాకు పరిశ్రమల జోక్యం నుంచి కాపాడటం' అన్న సందేశాన్ని నాటిక రూపంలో ప్రదర్శించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ మెడిసిన్ డిపార్ట్‌మెంట్ ఇన్‌చార్జ్ హెచ్‌వోడీ డాక్టర్ సింధియా శుభప్రద మాట్లాడుతూ వైద్య విద్యార్థులు రాబోయే కాలంలో సమాజానికి ఆరోగ్యాన్ని అందించే వారని, కావున వారు పొగాకు ఉత్పత్తుల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, ఎలాంటి చెడు అలవాట్లకు లోనుగాకూడదన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సాయిసుధీర్, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, లెక్చరర్లు, పర్ల ఆర్‌హెచ్‌సీ సిబ్బంది, వైద్యవిద్యార్థులు పాల్గొన్నారు.

దక్షిణ భారత క్రికెట్ పోటీలకు సిరాక్ విద్యార్థిని



విద్యార్థినిని అభినందిస్తున్న పాఠశాల కరస్పాండెంట్ ఇబ్రహీం

కర్నూలు (టౌన్): వచ్చే నెల 1 నుంచి 6 వ తేదీ వరకు నెల్లూరు పట్టణంలో అండర్-15 విభాగంలో నిర్వహిస్తున్న దక్షిణ భారత క్రికెట్ పోటీలకు నగరానికి చెందిన సిరాక్ ఇంగ్లిష్ మీడియం విద్యార్థిని కార్తికేయ ఎంపికయ్యారు. కార్తికేయను గురువారం పాఠశాలలో కరస్పాండెంట్ జీఎండీ. ఇబ్రహీం, తదితరులు అభినందించి పోటీల్లో ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు.

క్రీడల్లో సాధన చేయాలి

కర్నూలు (టౌన్): వేసవి సెలవులను వృథా చేయకుండా ఇష్టమైన క్రీడల్లో సాధన చేయాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు అన్నారు. గురువారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో చౌక్ బాల్ క్రీడలో వేసవి శిక్షణ శిబిరం నిర్వహించారు. క్రీడల్లో మెలకువలు వివరించారు. పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు కొంత సమయాన్ని క్రీడలకు కేటాయిస్తే జాతీయ స్థాయిలో రాణించవచ్చన్నారు. క్రీడల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులకు విద్యా, ఉద్యోగాల్లో అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో చౌక్‌బాల్ సంఘం కార్యదర్శి వేణుగోపాల్, శిక్షకులు శ్యామ్ కుమార్ పాల్గొన్నారు.

- స్థానిక పాతబస్టాండ్‌లోని మున్సిపల్ పార్కులో వేసవి తైక్వాండో ఉచిత శిక్షణ శిబిరం గురువారం ప్రారంభమైంది. కేవీ సుబ్బారెడ్డి విద్యా సంస్థల కరస్పాండెంట్ డాక్టర్ కేవీ. సుబ్బారెడ్డి శిబిరాన్ని ప్రారంభించి క్రీడాకారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో శిబిరం నిర్వహకులు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలందిద్దాం



కాలిన రోగుల వార్డును ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటరంగారెడ్డి

కర్నూలు(హాస్పిటల్): ఆసుపత్రిలో వైద్యులను నమ్ముకుని ఎంతో దూరం నుంచి వ్యయప్రయాసలకు ఓర్చి వచ్చే రోగులకు మెరుగైన సేవలందిద్దామని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి అన్నారు. ఆసుపత్రిలో ఇటీవల ప్రారంభమైన కాలిన రోగుల వార్డులో సేవలను గురువారం నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ కాలిన రోగుల కోసం నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ ప్రివెన్షన్ ఆఫ్ ది బర్న్ ఇన్‌జ్యూరీస్(ఎన్‌పీపీడీబీఐ) కింద కేంద్ర ప్రభుత్వం రూ.4.5 కోట్లతో ఈ ప్రాజెక్టును మంజూరు చేసిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ విభాగం అభివృద్ధికి నిధులు విడుదల చేశాయన్నారు. ఈ ప్రోగ్రామ్ కింద ప్రత్యేకంగా కాలిన రోగుల కోసం భవనం, మౌలిక సదుపాయాలు, 35 మంది వైద్యులు, సిబ్బంది వస్తారన్నారు. దీంతో కాలిన రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించేందుకు వీలవుతుందని చెప్పారు. కార్యక్రమంలో ప్లాస్టిక్ సర్జరీ విభాగం హెచ్‌వోడి డాక్టర్ మంజుల బాయి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజా రవికుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ స్వతంత్ర భారతి, డాక్టర్ విజయచంద్రమౌళి, డాక్టర్ సింధు ప్రియాంక, ఏపీఎంఎస్‌ఐడీసీ ఈఈ శివకుమార్, సీఎస్‌ఆర్‌ఎంవో డాక్టర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్‌ఆర్‌ఎంవో డాక్టర్ హేమనళిని, ఆర్‌ఎంవో డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివ బాలనాగాంజన్, డాక్టర్ కిరణ్‌కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్ వన్ సావిత్రిబాయి, గ్రేడ్-2 నాగమణి పాల్గొన్నారు.

ప్రశాంతంగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటేశ్వరమ్మ

కర్నూలు సిటీ: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో గురువారం జరిగిన కర్నూలు రూరల్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ప్రశాంతంగా జరిగింది. సమావేశంలో ఎంపీపీ డి.వెంకటేశ్వరమ్మ, ఎంపీడీఓ నరసింహ నాయుడు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో ఆయా శాఖలకు చెందిన పురోభివృద్ధిపై చర్చించారు. ఖరీఫ్ సీజన్‌లో చేపట్టే వ్యవసాయ పనులు, సాగు చేసే పంటల విస్తీర్ణం, విత్తనాల పంపిణీపై వ్యవసాయ శాఖ అధికారి వివరించారు. వర్షాకాలం సీజన్ రానుండడంతో పంచాయతీల్లో అధికారులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఎంపీపీ, ఎంపీడీఓ సూచనలు చేశారు. గ్రామాల్లో పరిశుభ్రమైన తాగు నీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాని, క్లోరినేషన్ చేసిన తరువాతే కుళాయిలకు నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. 14 శాఖలకు చెందిన అంశాలను సమావేశంలో ఆయా శాఖల అధికారులు వివరించారు.

రచయిత్రి విశాలాక్షి దేవికి అవార్డు



రచయిత్రి టి.విశాలాక్షి దేవిని సన్మానిస్తున్న దృశ్యం

కర్నూలు (కల్చరల్): కర్నూలుకు చెందిన రచయిత్రి టి.విశాలాక్షి దేవి బాలసాహిత్య అవార్డును అందుకున్నారు. గురువారం హైదరాబాదులో జరిగిన మాతృమూర్తి కోడూరు శాంతమ్మ స్మారక బాల సాహిత్య సమ్మేళనంలో కర్నూలుకు చెందిన ప్రముఖ రచయిత్రి టి.విశాలాక్షి దేవికి బాలల కథల విభాగంలో రెండవ బహుమతి లభించింది. తెలంగాణ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 200 బాలల కథల్లో పది కథలను ఎంపిక చేయగా విశాలాక్షి దేవి కథకు రెండవ బహుమతి లభించింది. ఆచార్య ఎండ్లూరి శివారెడ్డి, ఎం.రాధారెడ్డి, పాలడుగు సరోజినీ దేవి, డాక్టర్ పత్తిపాక మోహన్, డాక్టర్ జె.చెన్నయ్య, సీఏ ప్రసాద్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. బాల సాహిత్యం అవార్డు అందుకున్న విశాలాక్షి దేవికి పలువురు సాహితీవేత్తలు, సాహితీ సంస్థల ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

కౌంటింగ్‌కు పటిష్ట భద్రత

- కర్నూలు రేంజ్ డీఐజీ సీహెచ్ విజయరావు

బొమ్మలసత్రం: కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేస్తున్నామని, ఎన్నికల నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని కర్నూలు రేంజ్ డీఐజీ సీహెచ్ విజయరావు పేర్కొన్నారు. నంద్యాల పట్టణంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపుపై, తీసుకోవాల్సిన భద్రత ఏర్పాట్ల గురించి పోలీస్ అధికారులతో గురువారం ఆయన సమీక్ష నిర్వహించారు. కౌంటింగ్ సెంటర్, స్ట్రాంగ్ రూముల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎవరూ గుంపులుగా ఉండకూడదన్నారు. 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నందున అనుమతి లేకుండా ఎవరు ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించకుడదన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద ట్రాఫిక్ అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కేంద్రాల వద్దకు ఎన్నికలలో పోటీ చేసిన అభ్యర్థులు, వారి ఏజెంట్లు మాత్రమే వచ్చేలా చూడాలన్నారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి, గుర్తింపు కార్డులను పరిశీలించిన తర్వాత మాత్రమే లోపలికి అనుమతించాలన్నారు. కౌంటింగ్‌కు వచ్చేవారు మొబైల్స్ తీసుకు రాకూడదని, ఏజెంట్లు ఒక్కసారి కౌంటింగ్ కేంద్రం లోపలికి వెళ్లిన తర్వాత కౌంటింగ్ పూర్తి అయ్యేవరకు బయటకు వెళ్లడానికి వీలు లేదన్నారు. జిల్లాలోని సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఎస్పీ రఘువీర్ రెడ్డి, అడిషనల్ ఎస్పీ ఓ. ప్రవీణ్ కుమార్, డీఎస్పీలు జీవీ సంతోష్, శ్రీనివాసరెడ్డి, రవీంద్రనాథ్ రెడ్డి, షర్ఫుద్దీన్, శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

మున్సిపల్ ఉద్యోగులపై కేసు నమోదు?

డోన్ టౌన్: గత టీడీపీ ప్రభుత్వ హయాంలో డోన్ మున్సిపాలిటీ పరిధిలో జరిగిన అవినీతికి బాధ్యులుగా 14 మంది ఉద్యోగులపై కేసు నమోదు చేస్తున్నట్లు పట్టణ పోలీసులు గురువారం రాత్రి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో మరుగుదొడ్ల నిర్మాణం, డీజిల్ కొనుగోలులో రూ.24 లక్షల వరకు అవినీతి జరిగినట్లు విజిలెన్స్ అధికారులు ప్రభుత్వానికి నివేదిక అందించారు. ఇందుకు బాధ్యులైన వారిపై కేసు నమోదు చేస్తున్నట్లు పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. విచారణలో బాధ్యులను గుర్తించి పేర్లు వివరిస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు, 1వ వార్డు కౌన్సిలరు కొట్రికె ఫణిరాజ్ ఆయన భార్య గాయిత్రీ దేవి మున్సిపల్ చైర్మన్‌గా ఉన్న సమయంలో జరిగిన అవినీతిపై విజిలెన్స్‌కు ఫిర్యాదు అందడంతో విచారణ చేపట్టి రూ. 24 లక్షల మేరకు అక్రమాలు జరిగినట్లు గుర్తించారు.

హుండీ ఆదాయం రూ. 66.46 లక్షలు

మహానంది: హుండీలో కానుకల ద్వారా మహానందీశ్వరుడికి 65 రోజులకు రూ. 66,46,755 ఆదాయం వచ్చినట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. స్థానిక అభిషేక మండపంలో హుండీ కానుకల లెక్కింపు నిర్వహించినట్లు చెప్పారు. అన్నప్రసాదం విభాగం ద్వారా రూ. 94,915, గోసంరక్షణ విభాగం ద్వారా రూ. 35,644 వచ్చినట్లు తెలిపారు. నేపాల్, యూఎస్‌ఏ, యూఏఈ దేశాల కరెన్సీ వచ్చిందన్నారు.

రేపు హనుమాన్ జయంత్యుత్సవం

కర్నూలు (కల్చరల్): సీతారాముల కల్యాణ మహోత్సవ సమితి ఆధ్వర్యంలో జూన్ 1వ తేదీ సాయంత్రం 6 గంటలకు హనుమాన్ జయంత్యుత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు సమితి అధ్యక్షుడు కె.కృష్ణన్న, గౌరవ అధ్యక్షులు మోక్షేశ్వరుడు పేర్కొన్నారు. గురువారం సమితి కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లా గోరక్షణ మహా సంఘంలో వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. స్వామి వారికి అభిషేకం, అర్చన, హనుమాన్ చాలీసా పారాయణం, పల్లకీ సేవ, మహా మంగళహారతి, ప్రసాద వితరణ ఉంటుందన్నారు. సమావేశంలో సమితి ఉపాధ్యక్షులు మహాబలేష్, నారాయణ రెడ్డి, అవోపా చీఫ్ నాగేశ్వరరావు, దామోదర్‌రెడ్డి, కార్యదర్శి నాగోజీ రావు, కోశాధికారి కల్కి మురళి, సహ కార్యదర్శులు రమేష్, నటేష్, గోపీనాథ్ రావు, అచ్చి, లక్ష్మణ్, మల్లికార్జున, కుమార్ పాల్గొన్నారు.

8న సంస్కృతం పరీక్ష

కర్నూలు (సిటీ): రాయలసీమ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఆచార్య బి.సుధీర్ ప్రేమ్‌కుమార్ ఆదేశాల మేరకు జూన్ 8వ తేదీన సంస్కృతం పరీక్ష నిర్వహించనున్నట్లు వర్సిటీ పరీక్షల విభాగం కంట్రోలర్ వెంకటేశ్వర్లు తెలిపారు. 2023లో అడ్మిషన్ పొందిన మొదటి సంవత్సరం రెండో సెమిస్టర్ విద్యార్థులకు తల్లిదండ్రులు, విద్యాసంస్థలు విద్యార్థుల నుంచి వచ్చిన అభ్యర్థనల దృష్ట్యా సంస్కృతం పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు.

న్యాయవాది హత్య దారుణం

కర్నూలు (లీగల్): హిందూపురానికి చెందిన యువ న్యాయవాది సంపత్‌కుమార్‌ను దారుణంగా హత్య చేయడం హేయమైన చర్య అంటూ కేడీబీఏ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, బార్ కౌన్సిల్ సభ్యులు పి.రవిగువేరా ఖండించారు. తక్షణమే దుండగులను అరెస్టు చేసి చట్టపరంగా శిక్షించాలన్నారు. రాబోయే కాలంలో న్యాయవాదులపై భౌతిక దాడులను అరికట్టేలా న్యాయవాదుల రక్షణ చట్టం 2022ను నూతన ప్రభుత్వం బిల్లు చేయాలన్నారు. న్యాయవాది హత్య పాశవిక చర్య అని న్యాయవాదులు బి.కృష్ణమూర్తి, బీఎస్ రవికాంత్ ప్రసాద్, కె.రంగనాథ్, పి.దస్తగిరి, ఇ.రాజేష్, ఎస్.రాజేష్ బాబు, ఎం.జగదీష్ బాబు, జి.రమేష్ బాబు, నాగభూషణం నాయుడు, కె.మోహన్‌బాబు తదితరులు ఖండించారు.

ఎనిమిది మంది డిబార్

కర్నూలు (సిటీ): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కాలేజీలో జరుగుతున్న 2, 4, 6 సెమిస్టర్ పరీక్షల్లో గురువారం మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్న ఎనిమిది మంది విద్యార్థులు డిబార్ అయ్యారు. ఉదయం జరిగిన పరీక్షలకు 10,569 మంది విద్యార్థులకు గాను 9,538 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన సెమిస్టర్ పరీక్షలకు 221 మందికి గాను 197 మంది హాజరయ్యారు.